

# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం


RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 01 సంచిక -351 పేజీలు - 08 వెల - 06/-

బుధవారం 26 మార్చి 2025


## పీఎం కిసాన్ అనర్హుల నుంచి రూ. 416 కోట్లు రికవరీ



అనర్హుల ఏరివేతకు సంబంధించి

చర్యలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం

ఆధార్, ఆదాయపుపన్ను, ఆర్థిక మంత్రిత్వ శాఖల సమాచారంతో అనర్హుల ఏరివేత కార్యక్రమం

ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వఉద్యోగుల నుంచి రికవరీ

2లో



# ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ

**కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనిచేయాలి -కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నిర్దేశం**

మేలో తల్లికి వందనం అమలు

2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం

రాజధాని అమరావతి ప్రాజెక్టును 2027లోగా పూర్తి

ప్రజా సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యం కావాలి

విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలి

అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు- ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ..మిగతాది 2లో...




## ప్రసాదంపై జీఎస్టీ రద్దు

: ప్రకటించిన నిర్మలా సీతారామన్

రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆర్థిక బిల్లు 2025పై చర్చ

ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు జీఎస్టీ వర్తించబోదని వెల్లడి

ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ/డిజిటల్ పన్నును రద్దు చేయనున్నట్లు వెల్లడి



2లో

### ఐటీ, అడ్వాన్స్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి

# సిస్కోతో ఒప్పందం

మంత్రి నారా లోకేశ్ సమక్షంలో సిస్కో-ఏపీఎస్ఎస్ డీసీ ఎంఓయూ

ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ

విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి రంగాలలో కోర్సులు



అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య (డిగ్రీ, ఇంజనీరింగ్), వృత్తివిద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఐటీ, అడ్వాన్స్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రఖ్యాత ఐటీ సంస్థ సిస్కో, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నడుమ ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాల ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సిస్కో విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి మిగతాది 2లో...



## టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచరాజకీయాలు

: పెట్రో ధరలపై భగ్గుమన్న షర్మిల

పొరుగు రాష్ట్రాల్లో కంటే ఏపీలో పెట్రో ధరలు ఎక్కువగా ఉన్నాయన్న షర్మిల

ఇప్పుడు అధికారంలో ఉన్నందున మాట నిలబెట్టుకోవాలని షర్మిల డిమాండ్

2లో

## జమిలి ఎన్నికలపై ఏర్పాటైన జేపీసీ గడువు పొడిగింపు

రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనంకు జేపీసీ ఏర్పాటు

ఏప్రిల్ 4వ తేదీతో ముగియనున్న జేపీసీ కాలపరిమితి

గడువు పొడిగిస్తూ తీర్మానం ప్రతిపాదించిన బీజేపీ ఎంపీ పీపీ చౌదరి

వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు గడువు



2లో

## వేసవి ఊర్తయ్యే వరకు కాల్ సెంటర్లు

వేసవి నీటి ఎద్దడిపై కార్యాచరణ

మరో లక్ష ఎకరాల్లో అరకు కాఫీ ఉత్పత్తి

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు




6లో

# తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

## మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు

### మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు

హైదరాబాద్,మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.మిగతాది 2లో...



## లిక్కర్ స్కామ్ పేరుతో కుతంత్రాలు

ఏదో రకంగా జగన్‌ను అరెస్ట్ చేసే కుట్ర

ఎంపి శ్రీకృష్ణదేవరాయలుపై మండిపడ్డ పేర్నినాని



3లో

# ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ



(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణా అధికారులు అంటూ..ఏసీ రూమ్‌లకు కలెక్టర్లు పరిమితం కావద్దన్నారు.. సమస్యల పరిష్కారంలో కలెక్టర్లది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యమని వెల్లడించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలన్నారు. రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ విధానమని తెలిపారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని.. క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలని అన్నారు. అప్పులు తెస్తే ఎంతకాలం కొనసాగిస్తామని ప్రశ్నించారు.

వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదని.. అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తీర్పు ఇస్తారన్నారు. 9 నెలల్లో అనేక హామీలు అమలు చేస్తూ వస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా రూ.4 వేలు పింఛన్ లేదు.. మనం ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచామని చెప్పుకొచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్లతో రూ.5కే భోజనం అందిస్తున్నామని.. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. చెత్త పన్నును తొలగించామని తెలిపారు. 2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు. విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు.. పెన్షన్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అన్నారు.. సోలార్ పవర్‌లో భాగంగా 20 లక్షల మందికి సోలార్ పవర్ ఇవ్వడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ ను ప్లాన్ చేసే పనిలో కలెక్టర్లు ఉండాలని స్పష్టం చేశారు.. ప్రజల్లో అత్యంత ప్రభావం కలిగించే వ్యక్తి కలెక్టర్.. కెరీర్‌లో కలెక్టర్... చీఫ్ సెక్రెటరీకి ఇవే ముఖ్యం అన్నారు.. ఇక, రొటీన్‌గా ఉంటే ఏడాది అవుతుంది.. మరో నాలుగేళ్లు కూడా గడిచిపోతాయి అన్నారు. ఈ ప్రభుత్వం.. సంక్షేమం.. అభివృద్ధి.. సుపరిపాలన... ఈ మూడు గుర్తుండాలి.. ప్రజలు ఆనందంగా ఉండాలంటే సంక్షేమం కావాలి.. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా ఉంది.. కేవలం పెన్షన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్లు అవుతోందని వెల్లడించారు. అమరావతి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. ప్రజల్ని ప్రోగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలన్నారు.. 20 లక్షల మందికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు- చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో కలెక్టర్లు.. సోలార్ రూఫ్ టాప్ పై దృష్టి పెట్టాలన్నారు.. ప్రీ మాన్‌సూన్ పోస్ట్ మాన్‌సూన్ పై దృష్టి సారించాలి.. ప్రతి జిల్లా కలెక్టరు అరకు కాఫీ పై ఫోకస్ చేయాలన్నారు.. మరోవైపు, మే నెలలో తల్లికి వందనం ఇస్తాం.. త్వరలో విధి విధానాలు వస్తాయని తెలిపారు. 26 జిల్లాల కలెక్టర్ల పెర్ఫామెన్స్ పై సమీక్ష జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047.. వికసిత్ భారత్ పై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టి పెట్టారు.. అందుకు అనుగుణంగా.. 175 నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్‌లు ఉంటాయన్నారు.. ఎమ్మెల్యే ఆ నియోజకవర్గానికి చైర్మన్ గా ఉంటారని తెలిపారు సీఎం చంద్రబాబు.. గత పాలనతో విసిగి మాకు విస్తృత మద్దతు ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించే పక్రియ చేపట్టాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందాలని అన్నారుమే నెలలో తల్లికి వందనం పథకం ప్రారంభిస్తాం. రూ.15 వేల చొప్పున.. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తాం. పాఠశాలలు తెరిచేలోగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తాం. అయోమయంలో పడేసిన పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టాం. రాజధాని అమరావతి ప్రాజెక్టును 2027లోగా పూర్తి చేస్తాం. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి సంస్థల నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటున్నాం. ల్యాండ్ మానిటైజేషన్ ద్వారా ఈ అప్పులు తీర్చేస్తామని అన్నారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకూ ప్రణాళికలు చేరాల్సిందే. జీఎస్‌డీపీ, జీవీఏలతో పాటు- తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెంచాలి. వచ్చే ఏడాదికి 15 శాతం ప్లస్ జీఎస్‌డీపీ సాధించేలా కలెక్టర్లు కృషి చేయాలి. వ్యవసాయం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు.

కార్యక్రమంలో మంత్రులు, సిఎస్, ఇతర ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ అనర్హుల నుంచి రూ. 416 కోట్లు రికవరీ

న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అనర్హుల నుంచి రూ. 416 కోట్లు రికవరీ చేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. ఈ పథకంలో అనర్హుల ఏరివేతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ. 6 వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లో ఈ పథకం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 19 విడతల్లో రూ. 3.68 లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం ప్రారంభంలో స్వీయ ధృవీకరణ ఆధారంగా లబ్ధిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100 శాతం ఆధార్ సీడింగ్ పూర్తి చేయగా, ఆధార్, ఆదాయపన్ను శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖల వద్ద ఉన్న సమాచారంతో అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు ఈ పథకం కింద లబ్ధిపొందితే వారి నుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పీఎం కిసాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా రిజిస్టర్ చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు.

## ప్రసాదంపై జీఎస్టీ రద్దు

న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-

జీఎస్టీ నుండి ఆలయ ప్రసాదాలను మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై జరిగిన చర్చలో ఆమె ఈ ప్రకటన చేశారు.ఈ సందర్భంగా ఆమె పలు కీలక విషయాలను వెల్లడించారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలపై జీఎస్టీ వర్తించదని ఆమె స్పష్టం చేశారు.అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులలో నెలకొన్న అనిశ్చితిని తొలగించే క్రమంలో ఆన్‌లైన్ ప్రకటనలపై విధిస్తున్న ఈక్వలైజేషన్ లెవీ/డిజిటల్ పన్నును రద్దు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇది కూడా ఒకటి.

### మొత్తం 35 సవరణలకు అనుమతి

## లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-ఆన్ లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం పక్రియ లోక్‌సభలో పూర్తయింది.ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం పక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు- కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు-, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు-. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు- 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు- 4.8 శాతంగా అంచనావేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లు-గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడీపీ రూ. 3,24,11,406 కోట్లు-. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడిపీ 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

## జమిలి ఎన్నికలపై ఏర్పాటైన జేపీసీ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-

జమిలి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కాలపరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జేపీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, బీజేపీ ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన గడువు పెంపు తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. రాబోయే వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు గడువును పొడిగించింది.39 మంది ఎంపీలతో ఏర్పాటు చేసిన జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేస్తోంది. ఇందులో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. వాస్తవానికి ఈ కమిటీ కాలపరిమితి ఏప్రిల్ 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలి ఉందని అధికార వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో జేపీసీ గడువు పొడిగించే తీర్మానానికి లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది.

## టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచరాజకీయాలు : పెట్రో ధరలపై భగ్గుమన్న షర్మిల

అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-

తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్ మీద పన్నులు తగ్గింపుపై టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచ రాజకీయాలు అని విమర్శించారు. ప్రతిపక్షంలో ఒక మాట... అధికారపక్షంలో మరో మాట... గత 10 ఏళ్లుగా ఈ రెండు పార్టీల ప్రభుత్వాలు చేసింది దారి దోపిడీ తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. వ్యాట్ పేరుతో ఏ రాష్ట్రంలో లేనంతగా ప్రజలపై పన్ను పోటు విధించారని ఆరోపించారు. దేశంలోనే అత్యధిక పన్నులు వేసిన రాష్ట్రంగా ముందువరసలో పెట్టి... రాష్ట్ర ప్రజానీకాన్ని లూటీ చేశారని షర్మిల మండిపడ్డారు.

"ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 109.60, డీజిల్ ధర రూ. 97.47గా ఉంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో పెట్రోల్ రూ. 100.86, డీజిల్ రూ. 92.39బీ కర్ణాటకలో పెట్రోల్ రూ. 102.90, డీజిల్ రూ. 88.99బీ తెలంగాణలో పెట్రోల్ రూ. 107.46, డీజిల్ రూ. 95.70గా ఉన్నాయి. ఈ లెక్కల ప్రకారం, ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది" అని షర్మిల వివరించారు. చంద్రబాబు విపక్ష నేతగా ఉన్నప్పుడు లీటరుకు రూ. 17 తగ్గించాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. గతంలో జగన్ కూడా పెట్రోల్, డీజిల్ ధరలపై విమర్శలు చేసి, అధికారంలోకి వచ్చాక వాటిని పెంచారని గుర్తు చేసింది. రెండు పార్టీలు కలిసి ప్రజల నుంచి రూ. 50 వేల కోట్లు వసూలు చేశాయని ఆరోపించారు.

"కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఇంధనం ధరలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు మీరు అధికారంలో ఉన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎప్పటి నుంచి ధరలు తగ్గిస్తారో సమాధానం చెప్పాలి. 17 రూపాయలు ధర తగ్గించి ఇచ్చిన హామీ వెంటనే నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

## ఐటీ, అడ్వాన్స్డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి సిస్కోతో ఒప్పందం

నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి రంగాలలో అత్యాధునిక కంటెంట్‌ను అందిస్తుంది.

అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఏ కోర్సుల్లో శిక్షణ అందించాలో ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రాధాన్యతల ఆధారంగా కోర్సుల జాబితాను ఖరారు చేస్తారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధికి సిస్కో శిక్షణ అందించనుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, ఉపాధిని పెంపొందించడమే ఈ సహకారం లక్ష్యం.


ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించేలా సిస్కో వర్చువల్ విధానంలో %చీూమెుఖ్మంు% పోర్టల్ ద్వారా స్వీయ-అభ్యసన, బోధకుల నేతృత్వంలో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది. విద్యార్థులకు ఆయా సంస్థల డిమాండ్ ఆధారిత కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను డిజైన్ చేస్తారు. మారుతున్న సాంకేతికలకు అనుగుణంగా ముందస్తు అవసరాలకు సరిపడా సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. స్వీయ-అభ్యసన (సెల్ఫ్ లెర్నింగ్) కోర్సుల్లో అవగాహన పెంచడం, విద్యార్థులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశం. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా లెర్నర్ పార్టిసిపేషన్, కాంపిటీషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, వర్క్ షాప్స్ నిర్వహణ వంటివి ఏపీఎస్ఎస్ డీసీ చేపడుతుంది. ఆయా కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు, ఉద్యోగులకు సిస్కో సర్టిఫికెట్లను జారీచేస్తుంది. ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లను అందిస్తారు. ఐటీ కెరీర్ లో యువతులకు మద్దతు నిచ్చే ఉమెన్ రాక్ ఐటీ (డబ్ల్యూఆర్ఐటీ), అధునాతన టెక్నాలజీలో యువత, విద్యార్థులకు మద్దతునిచ్చే ఫైండ్ యువర్ సెల్ఫ్ ఇన్ ద ఫీచర్(ఎఫ్‌వైఐఎఫ్) వంటి ప్రోగ్రామ్ లను సిస్కో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుంది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ దేడ్రిచ్, గవర్నమెంట్ అఫైర్స్ డైరెక్టర్ హరీశ్ కృష్ణన్, సేల్స్ బిజినెస్ డెవలప్ మెంట్ డైరెక్టర్ కె. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

### మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అట్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్‌బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యం-అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.



# పెట్రోల్, డీజిల్‌లను జిఎస్టీ పరిధిలోకి తేవాలి

### ఎక్సైజ్ సుంకాలు తగ్గించుకోవాల్సిందే - పన్నులపై ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి

న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
పన్నుల వ్యవస్థలో సహేతుకమైన మార్పులు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ జనాన్ని దోచుకోడం మానుకోకుంటే సమాజంలో అస్థిరతకు కారణం కాగలదు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై పన్ను అక్కడికక్కడే చేతికి వచ్చి ఖజానాలను నింపుతాయి కాబట్టి వాటిని తగ్గించుకోడానికి పాలకులు వెనకాడుతున్నారు. అనుత్పాదక రంగాలకు అతిగా ఖర్చు పెట్టడం మానుకోవాలి. ఓట్లను రాబట్టే పథకాలను పక్కన పెట్టాలి. వస్తు, సేవల పన్ను నుంచి పెట్రోల్, డీజిల్‌ను మినహాయించడంలో ఆంతర్యం వాటి మీద తాము ఎప్పుడుబడితే అప్పుడు పన్నులను విధించి రాబడి పెంచుకోవాలన్న దురుద్దేశ్యం తప్ప మరోటి కానరాదు. ఇంధన ధరలను అదుపు చేయడంతో పాటు, సామాన్యులకు కూడా ధరలు అందుకునేలా ఉండాలి. పెట్రోట్, డీజెల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకోడం సరైన నిర్ణయంగా గుర్తించాలి. అదేపనిగా పన్నుల రూపంలో ప్రజలను దోచుకోవడం తగదని గుర్తించాలి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రజలపై భారాలు మోపడం సరికాదని పాలకులు గమనించాలి. పెట్రోలులపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గించుకుంటేనే ఆ మేరకు వీటి ధరలు తగ్గి ప్రజలకు




కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విధించే స్పెషల్ సుంకాలలో రాష్ట్రాలకు వాటా వుండదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తన ఆదాయానికి ఈ స్పెషల్ సుంకాల విధింపుపై ఆధారపడడం ఎక్కువైంది. ఇలాంటి సుంకాలతో భారం మోపే బదులు పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవడం మంచిది. కానీ తాజాగా ఎంపిల జీతభత్యాలను, పెన్షన్లు పెంచుకున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. పెట్రోల్ చిల్లర ధరలో 54 శాతం కేంద్ర, రాష్ట్రాలు విధించే పన్నుల కిందే పోతుంది. అలాగే డీజెల్ ధరలో 49 శాతం ఈ పన్నులే వుంటాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌పై ప్రతి లీటర్ వద్ద రూ. 32.9 మేరకు ఎక్సైజ్ సుంకాన్ని వసూలు చేస్తున్నది. అలాగే డీజెల్ మీద రూ. 31.8 తీసుకుం టున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్నులు ఇందుకు అదనంగా వుంటాయి. జిఎస్టీ పేరుతో ఇప్పటికే వాయింపులు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. నేలవిడిచి సాము చేసే పద్దతిని విడనాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజెల్‌పై తాము వసూలు చేసే పన్నులను గణనీయంగా తగ్గించుకోగలిగితే ప్రజలపై భారం తగ్గి వాటిని సునాయాసంగా కొనుగోలు చేయగలుగుతారు. దేశంలో వినియోగిస్తున్న చమురులో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఓఎన్‌జిసి కష్టపడి శోధించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను పూర్తి స్థాయిలో వెలికి తీయకుండానే ఈ రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించారు. దానితో ప్రైవేటు కంపెనీలకు మేలు చేసిన వారు అవుతున్నారు. ఈ లెక్కన త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజెల్ ధరలు కనీసంగా రూ.115 లకు చేరే ప్రమాదమున్నది. ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను పక్కన పెట్టి ప్రజలను పన్నుల భారం నుంచి తప్పించాలి. దుబారా తగ్గించుకోవడం చేయాలి.

# వల్లభనేని వంశీ రిమాండ్ పొడిగింపు

అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీకి విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు రిమాండ్ పొడిగించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏప్రిల్ 8 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు ఆదేశించింది. ఆయనతో పాటు మరో నలుగురు నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ఏ-1 వల్లభనేని వంశీ మోహన్, ఏ-4 గంటా వీర్రాజు, ఏ-7 ఎలినేని వెంకట శివరామకృష్ణ ప్రసాద్, ఏ-8 నిమ్మల లక్ష్మీపతి, ఏ-10 వేల్పూరు వంశీలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. దీంతో వీరికి ఏప్రిల్ 8 వరకు రిమాండ్ పొడిగిస్తూ



న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. విచారణ సమయంలో వంశీని న్యాయాధికారి నేరుగా పలు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. జైల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు న్యాయాధికారి. గతంలో అనారోగ్యం దృష్ట్యా వేసిన పిటిషన్‌లపై మంచంతో పాటు పరుపు, దిండు కూడా అనుమతిస్తూ కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయనే దానిపై న్యాయాధికారి ఆరా తీయగా సింగిల్ బ్యారేక్‌లో ఉన్నందున ఇబ్బందిగా ఉందని, వేరే బ్యారేక్ మార్చాలని లేదా.. ఇప్పటికే తనతో పాటు రిమాండ్‌లో ఉన్న వారిలో ఒకరిని కాని ఇద్దరిని కానీ ఉంచే వెసులుబాటు కల్పించాలని న్యాయాధికారికి వంశీ విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి గతంలోనే పిటిషన్ వేసిన పరిస్థితులు, అప్పటి విచారణపై న్యాయాధికారి స్పందించారు. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేతగా ఉన్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా వేరే వారిని వంశీతో కలిపి ఉంచలేమని జైలు అధికారులు, పోలీసులు గతంలోనే కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

# జాతీయ జలవిధానంపై స్పష్టత రావాలి

న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతకు సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే
జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు.
జాతీయ జలవిధానం రూపొందించి
నదీ జలాల సమగ్ర వినియోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయారాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముమ్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ



రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. అలాగే కాళేశ్వరం పూర్తయితే తెలంగాణ కూడా సస్యశ్యామలం కాగలదు. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కటు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఆ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారినప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్‌లో కౌంటర్ దాఖలు చేయడం ద్వారా కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసింది. ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. బ్రిజేష్ ట్రిబ్యునల్ అవలంబిస్తున్న ధోరణి, అది చేపట్టిన విచారణ మొదటి నుంచీ ఎగువ రాష్ట్రలకు అనుకూలంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా సాగింది. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి. నీటి లభ్యత లేని సమయంలో ఎగువ రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని వాడుకుంటే కిందికి చుక్కరాదు. దిగువ రాష్ట్రం అనివార్యంగా నష్టపోవాల్సిందే. కొత్తగా తెలంగాణ ఏర్పడ్డ కారణంగా ఇప్పుడు నీటిని అన్ని రాష్ట్రాలు సమానంగా పంచుకునేలా తీర్పు ఉండాలి. అప్పుడే న్యాయం జరగగలదు. తెలంగాణ, ఆంధ్ర సమస్యగా ఉద్వేగాలతో ముడిపెట్టకుండా రెండు తెలుగు రాష్ట్రాలు సమన్వయంతో పని చేయాలి.

## దిగుమతులపై ఆధారపడితే ముప్పే



న్యూఢిల్లీ, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- ప్రపంచ సరకుల మార్కెట్లలో రష్యాది ప్రధాన పాత్ర కావడంతో అక్కడి కుదుపులన్నీ మనపై ప్రభావం చూపక మానవు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సహజవాయు ఎగుమతిదారు రష్యా. రెండో అతి పెద్ద చమురు ఎగుమతిదారూ ఆ దేశమే. ఆ దేశ జీడీపీలో అయిదోవంతు వీటి పుణ్యమే. ప్రపంచ చమురు దిగుమతుల్లో 12 శాతం రష్యా నుంచే వస్తాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుంచి ముడి చమురు ఫ్యూచర్లు 26 శాతం పైగా పెరిగాయి. గత డిసెంబర్‌లో బ్యారల్ 70 డాలర్లున్న అంతర్జాతీయ ముడి చమురు ధర ఇప్పుడు దాదాపు రెట్టింపు అయింది. చమురు అవసరాల్లో 85 శాతానికి దిగుమతులపైనే ఆధారపడ్డ దేశం మనది. ఇప్పుడిక ముడిచమురు దిగుమతి ఖర్చు భారీగా పెరుగుతుంది. చమురు కోసం రష్యాపై ఆధారపడ్డ పాశ్చాత్య దేశాలు తంటాలు పడుతున్నాయి. చమురు ధరల కారణంగా పెరిగే ఆ ఖర్చు ప్రభావం సరకుల రవాణా మీద పడుతుంది. సరకుల రేట్లకు రెక్కలొస్తాయి. ఆహార ధరలు పెరుగుతాయి. గోధుమలు, మొక్కజొన్న, బార్లీ ప్రపంచ ఎగుమతుల్లోనూ రష్యా, ఉక్రెయిన్లది గణనీయమైన పాత్ర. వాటి రేట్లూ పెరుగుతున్నాయి. మన ఎరువుల దిగుమతుల్లో దాదాపు 17 శాతం పొటాష్, 60 శాతం ఎన్పీకే ఎరువులు రష్యావే. ఈ క్రమంలో దిగుమతులపై ఆధారపడ్డ మనం ధరల దాడిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాజధాని నిర్మాణంలో ఆలస్యం

### ఇంతవరకు రాజధానిలేని రాష్ట్రంగా ఏపీ -అమరావతిలో పర్యటించిన మంత్రి నారాయణ

అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-రాష్ట్ర విభజన జరిగి సుమారు తొమ్మిదేళ్లు అవుతున్నా ఇంకా ఏపీకి రాజధాని లేదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాజధాని నిర్మాణం మరింత ఆలస్యమైందని మంత్రి నారాయణ అన్నారు. ఏపీ రాజధాని అమరావతిలో నారాయణ మంగళవారం పర్యటించారు. ఇప్పటికే పలు పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగ్లాలను, సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి అయినా రాజధాని అవసరమని, ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. గత టీడీపీ హయాంలో రూ. 43 వేల కోట్లకు టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా సర్వీస్ భవనాలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. కానీ గత ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. ఐఐటీ మద్రాస్‌ను పిలిచి బిల్డింగ్ నాణ్యత పరిశీలించి, కాంట్రాక్టర్లతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. 90 శాతం పనులు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. మొదట క్లీనింగ్‌తో పనులు మొదలు అయ్యాయన్నారు. ఇవాళ సెక్రెటరీ.. ప్రిన్సిపాల్ కార్యదర్శి బంగళాలు పరిశీలించామన్నారు. 186 బంగాళాలు మంత్రులు, జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయన్నారు. గెజిటెడ్ అధికారులకు 1440,ఎన్జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయని తెలిపారు. అలాగే హై కోర్ట్ 16.85 లక్షల చదరవు అడుగులు వస్తుందన్నారు. అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో ఉంటుందని, 15 రోజుల్లో కాంట్రాక్టర్ల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని నారాయణ తెలిపారు. ప్రజలపై ఒక్క పైసా భారం కూడా లేకుండా రాజధాని నిర్మాణం పూర్తి అవుతుందని, వరల్డ్ బాంక్.. ఎడిబి నుంచి రుణాలు తీసుకున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ వాల్యూ పెరిగిన తర్వాత. అప్పు తీర్చడం జరుగుతుందన్నారు. ప్రజల డబ్బు వృధా చేస్తున్నారని ప్రతిపక్షం చెబుతోందని.. ఇది సరికాదని మంత్రి అన్నారు. మరోవైపు



విశాఖ జిల్లా, భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు. ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై నాలుగు రోజుల క్రితం విశాఖ స్థానిక నేతలతో చర్చించామన్నారు. వీఎంఆర్డీఏ పరిధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని తెలిపారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని.. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## లిక్కర్ స్కామ్ పేరుతో కుతంత్రాలు

### ఏదో రకంగా జగన్‌ను అరెస్ట్ చేసే కుట్ర

### ఎంపి శ్రీకృష్ణదేవరాయలుపై మండిపడ్డ పేర్నినాని

అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- ఏపీలో లేని లిక్కర్ స్కాం పేరు చెప్పి కూటమి ప్రభుత్వం ఏదో ఒక రకంగా తప్పుడు ఆరోపణలతో మాజీ సీఎం వైఎస్ జగన్ ను అరెస్ట్ చేయాలని చూస్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఎక్సైజ్ శాఖలో ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డి గతంలో తనను బెదిరిస్తున్నారని హైకోర్టు న్యాయమూర్తులకు విన్నవించారని.. ఇప్పుడు ఆయనను బెదిరించి తప్పుడు స్టేటెమెంట్ లు తీసుకున్నారన్నారు. అమాయకుల పేర్లు చెప్పి ఏదో ఒక రకంగా జగన్ ను ముద్దయిని చేయాలని చూస్తున్నారన్నారు.. ఏదో ఒక రకంగా జగన్ ను అరెస్ట్ చేయాలనే ఉద్దేశ్యమే వారిలో కనిపిస్తోందన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు.. టీడీపీ గూటికి చేరి చిలక పలుకులు పలుకుతున్నారన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మీ పేరు లేకపోయినా.. ఎవరి పేరు మీద మీరు పెట్టుబడులు పెట్టారో మీ అంతరాత్మను తెలుసన్నారు.. తప్పుడు వాంగ్మూలాలతో కౌరవ సభలో మాట్లాడినంత మాత్రాన జంకేది లేదన్నారు. చిలక పలుకులు పలుకుతున్న కృష్ణదేవరాయలు స్కిల్ స్కాంలో చంద్రబాబుకి ఇచ్చిన ఈడీ, ఐటీ నోటీ-సులపై కూడా మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఏపీలో లిక్కర్ వ్యాపారం జరిగినప్పుడు ఏం తప్పులు జరిగాయని మీరు అనుకుంటున్నారు.. ఆ సమయంలో మీరు వైసీపీలో ఉన్నారు.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదు.. గతంలో డిస్టలరీలకు చెల్లించిన రేటెంత.. ఇప్పుడు చెల్లిస్తున్న రేటెంత..అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుపై పేర్నినాని ప్రశ్నల వర్షం కురిపించారు .. ఇవాళ మద్యం షాపులను వచ్చిన వారి దగ్గర నుంచి బెదిరించి లోబరచుకున్నారని ఆరోపించిన ఆయన.. ఎమ్మెల్యే నుంచి సీఎం వరకు దండుకుంటు-న్నారు.. ఆఖరికి గీత కార్మికులకు ఇచ్చిన షాపులు కూడా బలవంతంగా లాక్కుంటు-న్నారని విమర్శించారు.. మీ సీఎం చంద్రబాబుకు ఇచ్చిన ఐటీ నోటీసులపై కూడా మాట్లాడాలి.. ఈడీ నోటీసు సగంలో ఎందుకు పక్కనపెట్టారో చెప్పాలి.. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ లీలలు కూడా అడగండి.. స్కిల్ స్కాం స్టార్ట్ అవగానే ఆయన ఏమై పోయారు.. అప్పుడు ఎక్కడికి వెళ్ళారు.. ఎప్పుడు వచ్చారు.. ఏం చేస్తున్నారు.. ఇవన్నీ అడగాలని మాజీ మంత్రి పేర్నినాని సూచించారు..

## లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్





**కర్నూల్ ప్రతినిధి మార్చి 25 ( రిపబ్లిక్ న్యూస్):** జి.కబర్ధి, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారి సూచనల మేరకు బి. లీలా వెంకట శేషాద్రి, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను వివరించారు, ఈ కార్యక్రమంలో శివరాం, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, శ్రీమతి ఏ. సులోచన , అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పాల్గొన్నారు.

## 26న కార్పొరేషన్ ముట్టడిలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనండి

### - పి.నిర్మల

**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్ లో ప్రజా చైతన్య యాత్రలో పాల్గొన్న సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి .నిర్మల మాట్లాడుతూ కర్నూలు యకార్పొరేషన్ పరిధిలో విస్తరిస్తున్న కాలనీలలో ప్రధానంగా మంచినీటి సమస్యతో అల్లాడిపోతున్నారని డ్రైనేజీ వ్యవస్థ గందరగోళంగా ఉందని అన్నారు చెత్తాచెదారంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ప్రతి సంవత్సరము ఇంటి పన్నులు 15% పెంచే విధంగా 198 జీవోను



తీసుకువచ్చారని దాని కారణంగా పేద మధ్యతరగతి ప్రజలు ప్రతి సంవత్సరం పెరుగుతున్న పన్నులతోఅనేక ఇబ్బందులు పడుతున్నారని మేము అధికారంలోకి వస్తే పన్నులు తగ్గిస్తామని198 జీవోను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు .ఇందిరాగాంధీ నగర్ లో ప్రజలు అనేక సమస్యలు సిపిఎం పార్టీ బృందానికి తెలియజేయడం జరిగింది మార్కెట్ యార్డ్ నుండి వస్తున్న మిరపకాయల ఘాటు వల్ల ముసలి వాళ్లు పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారని చెప్పడం జరిగింది డ్రైనేజీ కాలవలు కనీసం వారానికి ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని కరెంటు చార్జీలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యే విధంగా సిపిఎం పార్టీగా పోరాడాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కే. అరుణ. వార్డు కార్యదర్శి ఎం. కుమారి. పిఎస్. సుజాత. అయ్యమ్మ, పర్వీన్, లక్ష్మీదేవి, జమున తదితరులు పాల్గొన్నారు.

## కుడా అప్రూవల్ లేని లే అవుట్లను కొని మోసపోకండి

### కుడా చైర్మన్ సోమిశెట్టి



**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
గత వైకాపా ప్రభుత్వంలో కుడా (కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) లో చాలా అవకతవకలు జరిపి గంగరగోళం చేశారని, ఇందులో భాగంగానే కుడా నాన్ లే అవుట్ ప్లాట్లను కొనుగోలుదారులకు అమ్మినట్లు గుర్తించడం జరిగిందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గారు ఈ రోజు కుడా కార్యాలయం, కర్నూలు నందు విలేఖరుల సమావేశంలో మాట్లాడడం జరిగింది. ఈ సంధర్భంగా మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో కుడా ఏర్పాటు చేయడం జరిగిందని, గతంలో కుడా చైర్మన్ గా నేను ఉన్న సమయంలో అభివృద్ధి బాటలో నడిపించడం జరిగిందని, వైకాపా ప్రభుత్వంలో ఎన్నో అక్రమాలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించిందని తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకర్గములలో ఎక్కడ నాన్ లేఅవుట్లు ఉన్నాయని, లే అవుట్లు వేస్తూ కుడా రావల్సిన ఫీజులు రాకుండా ఎగ్గొట్టే వారి జాబితా రూపొందించడం జరిగిందని, మొత్తం 220 మందిని గుర్తించి వారికి మొదటి మరియు రెండవ నోటీసులు కూడా జారీ చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా ఎవరైన ప్లాట్లు ఇళ్ళ స్థలాలు కొనాలని ఉద్దేశించిన వారు కుడా అప్రూవల్ ఉందో లేదో తప్పనిసరిగా చూసుకోవాలని, 2017 ముందు ప్లాట్లకు అయితే ఈ.సి అప్రూవల్ ఉండాలని ఈ అప్రూవల్స్ ఉన్న వాటిని మాత్రమే ప్రజలు కొనుగోలు చేయాలని సూచించారు. ఆప్రూవల్ లేని వాటిని కొనుగోలు చేసుకున్నట్లైతే బ్యాంకు రుణాలు రావని, విద్యుత్తు సరఫరా ఉండదని, నీటి సౌకర్యం కల్పించడం కుదరదని కావున ప్రజలు ఒకటికి రెండు సార్లు అప్రూవల్స్ ను తప్పనిసరిగా చూసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గములలో 9 నియోజకవర్గములలో స్వయంగా నేను పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని, అలాగే ప్రతి నియోజకవర్గములో పాంప్లెట్లు, వాల్ పోస్టర్లు మరియు ఆటోల ద్వారా మైకులు పెట్టి నాన్ లే అవుట్ స్థలాలను కొనుగోలు చేసి మోసపోకండి అంటూ ప్రచారం చేస్తున్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారు లే అవుట్ రోడ్డు, స్థంబాలు, కల్వర్టు ఏర్పాటు చేయాలి, వాటర్ ట్యాంకు ఏర్పాటు వేయాలని, ఇవీ అన్నీ కూడా ఉంటేనే కుడా ఆప్రూవల్ వస్తుందని, ఇవి లేని పక్షంలో కుడా అప్రూవల్ రాదని స్పష్టం చేశారు. మంత్రాలయం కేంద్రం రాఘవేంద్ర స్వామి సన్నిధిలో చాలా మంది నాన్ లేఅవుట్, ప్లాట్లు ఇళ్ళ స్థలాలు వేయడం జరిగిందని, అక్కడ చాలా మంది ఇంటికి అప్రూవల్ తీసుకొని పంచాయితీ సెక్రెటరీతో జీం2 అనుమతి తీసుకొని 5 ఫ్లోర్లు నిర్మించారని, ఇలాగ 80 లాడ్జీలు నిర్మించారని, వీరి నుంచి కుడాకు రావల్సిన బకాయిలు రాకుండా ఉన్నాయని, వారు కుడా అప్రూవల్ తీసుకోకుండా ఉన్నారని, వీరందరికీ నోటీసులు పంపడం జరిగిందని, అలాగే పంచాయితీ సెక్రటరీ కి కూడా నోటీసులు పంపడం జరిగిందని అన్నారు. స్థానికంగా ఉన్న కుడా ఉద్యోగస్థులు వీరిని కుడా అప్రూవల్ తీసుకొని కుడాకు చెల్లించాల్సిన రుసుములు చెల్లించాలని హెచ్చరిస్తున్నారని, అయితే కొంత మంది స్పందించారని మిగిలిన వారికి వారం రోజులు సమయం ఇస్తున్నానని, ఈ వారం రోజుల లోపల కుడా కు చెల్లించాల్సిన రుసుములు చెల్లించకుండా లాడ్జీలు నడిపితే మాత్రం కరెంట్, నీరు కట్ చేయడబడుతుందని హెచ్చరించారు. కుడాకు ఆదాయం తీసుకురావల్సిన బాధ్యత తనపై ఉందని కావున అప్రూవల్స్ విషయంలో నిఖచ్చితంగా వ్యవహరిస్తానని తెలిపారు. ఆదాయం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని, ఆత్మకూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, నంద్యాల, ఆళ్ళగడ్డ ప్రాంతాలలో ప్లాట్లు వేశారు కాని అక్కడ రోడ్లు లేవని వాటిని కొని ప్రజలు మోసపోతున్నారని, ప్రజలు ఆలోచించి ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు.

## కోడుమూరు ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులని దారుణంగా కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి-.ఎస్ఎఫ్ఐ

### క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.



కర్నూల్ ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ మాట్లాడుతూ కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులని దారుణంగా కొట్టిన విద్యార్థులపై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. సంక్షేమ హాస్టల్లో వార్డెన్లు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల జూనియర్ విద్యార్థులని సీనియర్ విద్యార్థులు ఇష్టం వచ్చినట్లు కొట్టడం వారి పట్ల పెత్తనం చెలాయించడం జరుగుతుంది. వార్డెన్ లే కొంతమంది విద్యార్థులని బానిసల్లగా మార్చుకొని హాస్టల్లో ఉన్న సమస్యలను ప్రశ్నించే విద్యార్థులపై కొట్టడానికి రుషి కలుపుతున్నారు . ఉన్నత అధికారులు కూడా చూసి చూడనట్లు వివరించడం వల్లే ఈరోజు కోడుమూరులో విద్యార్థులపై అంత కిరాతకంగా ప్రవర్తించడానికి ప్రధాన కారణం. ఇప్పటికైనా కర్నూలు జిల్లాలో ఉన్న సంక్షేమ ఆస్తులని జిల్లా కలెక్టర్ గారు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి జరుగుతున్న దారుణాలను అరికట్టాలని కోరుకుంటున్నాము. లేనియెడల విద్యార్థులందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాము.

## బాలికల విద్య కు మాలబార్ గోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్ షిలు




**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
బాలికల విద్యకు మలాబార్ గోల్డ్ సంస్థ ప్రొత్సహిస్తుందని కర్నూలు జిల్లా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబందించిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మలాబార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్కాలర్ షిప్ లను అందించారు. కర్నూలు లో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి పరమేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా వచ్చి విద్యార్థులకు చెక్కులను అందించారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్న అర్హులకు అమ్మాయిలకు ఈస్కాలర్ షిప్ లు ప్రతి సంవత్సరం మలాబార్ చారిటబుల్ సంస్థ అందించడం హర్షించదగ్గ విషయం అని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సాధికారత కోసం దేశ వ్యాప్తంగా 21 వేల విద్యార్థులకు 16 కోట్ల రూపాయలు ఇస్తున్నారని అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1,928 మంది విద్యార్థులకు 1కోటి 67 లక్షల రూపాయలు ఇచ్చారని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 209 మంది అమ్మాయిలకు 18 లక్షల 64 వేల రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మలాబార్ సంస్థ విద్యతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తుందని మలాబార్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మహిళాల విద్య కోసం ఆర్థిక సహాయం చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఫయాజ్, నూరుల్లా, లాలప్ప, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పన్ను బకాయిలపై 50% మాఫి సద్వినియోగపరచుకోండి

### పన్ను బకాయిదారులకు కమిషనర్ లేఖ

- సచివాలయ సిబ్బందితో వాట్సాప్ ద్వారా చేరవేత
- ప్రయోజనాలు పొందుతూ ఇంకా జాప్యాన్ని అంగీకరించలేం
- చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సమయం ఆసన్నమైంది.



**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
నగరంలో ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుములను రాబట్టేందుకు వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్తున్న కర్నూలు నగరపాలక సంస్థ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన చేసిన జీవో 46 ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను బకాయిలపై 50% వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వినూత్నంగా బకాయిదారులకు సచివాలయ సిబ్బందితో వాట్సాప్ ద్వారా లేఖ పంపారు. కొన్నేళు ్లగా బకాయిలు చెల్లించాలని వివిధ రూపాల్లో కోరుతున్నప్పటికీ, కొంతమంది బకాయిదారులు మొండిగా వివరించడం అంగీకరించలేమని కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు, పూడికతీత పనులు, రహదారుల పరిశుభ్రత, శునకాల బెడద నియంత్రణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారుల నిర్వహణ, ఉద్యానవనాల నిర్వహణ, మురుగు కాలువల నిర్మాణాల అవసరం పౌరులకు ఎంతుందో, వీటి కోసం నిధులు సమకూర్చుకోవడం కూడా అంతే అవసరమని స్పష్టం చేశారు. మొండి బకాయిదారులపై తమకున్న విచక్షణ అధికారము ఉపయోగించి చట్ట ప్రకారంగా మరింత కఠిన చర్యలు తీసుకునేందుకు సమయం ఆసన్నమైందన్నారు. తాగునీటి సరఫరా నిలిపివేయడం, షాపులు సీజ్ చేయడం వంటివి తప్పదని హెచ్చరించారు. ప్రయోజనాలు పొందుతూ పన్నులు చెల్లింపునకు జాప్యం చేయడం తగదని, సత్వరమే తమ పన్నులను చెల్లించాలని కమిషనర్ బకాయిదారులకు హితవు పలికారు.

## కర్ణాటక గవర్నర్ పర్యటన సందర్భంగా భద్రత ఏర్పాట్ల పరిశీలన






నంద్యాల క్రైం, మార్చి 25, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ మంగళవారం నంద్యాల జిల్లా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం శ్రీశైలంలో పర్యటించనున్న సందర్భంగా గవర్నర్ పర్యటించే ప్రదేశాలను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్వయంగా సందర్శించి భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తగు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ చంద్రబాబు శ్రీశైలం సీఐ ప్రసాదరావు తదితరులున్నారు.

## కేంద్ర సహకార బ్యాంక్ అధికారులు బకాయిల పేరుతో రైతుల ఆస్తులను జప్తు చేసి అవమానించడం ఆపాలి....

### బి.గిడ్డయ్య.... సిపిఐ జిల్లా కార్యదర్శి....

**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలుకేంద్ర సహకార బ్యాంకు,సొసైటీలు రైతులకు ఇచ్చిన రుణాలు రికవరీ పేరుతో చిప్పగిరి మండలం బెల్డోన, నగరడోన గ్రామాలతోపాటు ఆలూరు లో రైతుల ఇళ్ళలేక జొరబడి రైతుల ఆస్తులను బలవంతంగా ఇంటిలో ఉన్న వస్తువులను జప్తు చేయడం రైతులను అవమానించడం తక్షణమే ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. అప్పులు చెల్లించడానికి కొంత సమయం కావాలని రైతుల కోరినప్పటికీ పట్టించుకోకుండా రైతులను తీవ్రంగా మనోవేదన గురి చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో కరువు కాటకాల కారణంగా పంటలు పండక రైతులు అప్పుల పాలై అనేకమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని,పశ్చిమ ప్రాంతం ఆలూరు ఆదోని పత్తికొండ ఎమ్మిగనూరు మంత్రాలయం నుండి సుదూర ప్రాంతాలకు లక్షలాది కుటుంబాలు వలస పోయి జీవనం గడుపుతున్నారని, ఈ సమయంలో రైతులకు, ప్రజలకు భరోసా, ధైర్యం కల్పించాల్సిన ప్రభుత్వం రుణాల రికవరీ పేరుతో కేంద్ర సహకార బ్యాంకు,సొసైటీలు ఇచ్చిన రుణాలను బకాయిల వసూళ్ల పేరుతో బలవంతంగా రైతుల ఇళ్లలోకి త్వరపడి ఇంట్లో ఉన్న వస్తువులు ఏది దొరికితే అది దౌర్జన్యంగా ఎత్తుకెళ్లడం దారుణమని దీని కారణంగా రైతులు తీవ్రంగా మనోవేదన చెందుతున్నారని తక్షణమే బలవంతపు జప్తులకు స్వస్తి పలకాలని కేంద్ర సహకార బ్యాంకు అధికారులను కోరారు. ఈ విషయంలో తక్షణమే జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జిల్లాలో రైతులకు ప్రభుత్వము అండగా నిలబడాలని డిమాండ్ చేశారు.



# 2024 బాయిలర్ బిల్లు పై

## పార్లమెంటులో మాట్లాడిన ఎం.పి నాగరాజు

**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**



1923 బాయిలర్ బిల్లును రద్దు చేస్తూ దాని స్థానంలో 2024 బాయిలర్ బిల్లు ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది.. ఈ సందర్భంగా బిల్లు పై జరిగిన చర్చలో కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు మాట్లాడారు... 2024 బాయిలర్ బిల్లు ప్రజల యొక్క భద్రత మరియు విలువైన వనరులను బాయిలర్స్ పేలుళ్ల ద్వారా సంభవించే విపత్తులను రక్షించడం కోసం నిర్దేశించబడిందన్నారు.. ఈ బిల్లు ద్వారా సులభతర వ్యాపారాన్ని పెంచే అవకాశం ఉందన్నారు... ఈ బిల్లు బాయిలర్లను ఉపయోగించే వారికి , ఎం.ఎస్.ఎం.ఈ తో సహా అందరికి ప్రయోజనం కలుగుతుందన్నారు.బాయిలర్ల భద్రత, బాయిలర్లను పని చేయించే వారి భద్రత ను దృష్టిలో ఉంచుకొని ప్రాణ , ఆస్తి నష్టం కలిగించే ఏడు నేరాలలో మూడు నేరాలను నేర రహితం చేయడం ద్వారా సూక్ష్మ, చిన్న , మధ్య తరహా సంస్థలను ఎం.ఎస్.ఎం.ఈ నిర్వహణ భారం తగ్గిస్తుందన్నారు... కోర్టులు విధించే జరిమాన స్థానంలో కార్య నిర్వహణ జరిమానాలను ప్రవేశ పెట్టడం ద్వారా నియంత్రణ ప్రక్రియ వేగవంతం గా పెరిగి సమర్థవంతంగా ముందుకు సాగుతుందన్నారు... ఈ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర బాయిలర్స్ బోర్డుల విధులు, అధికారాలను ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పొందుపరిచారన్నారు.. ప్రధాని నరేంద్ర మోదీ దేశ పారిశ్రామిక రంగం భద్రతకు తీసుకొచ్చిన 2024 బాయిలర్ బిల్లుకు తాము సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు ఎం.పి నాగరాజు తెలిపారు...

# రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

## - కర్నూలు ఆర్డిఓ





**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
ముచ్చుమర్రి నుండి ఓర్వకల్ వరకు పరిశ్రమల నిమిత్తమైఏ పీ ఐ ఐ సి వాటర్ పైప్ లైన్ వేస్తున్నాము. ఇందుకు మన కర్నూలు జిల్లాలో సంబంధించి మూడు గ్రామాలలో ఈ పైప్ లైన్ వెళ్తుంది.కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో కర్నూలు మండలం లోని గార్గేయ పురం గ్రామం, ఓర్వకల్ మండలం లో కేతవరం గ్రామం, పూడి చెర్ల గ్రామాలలో ఈ పైపులైను వెళ్లనుంది. వాటర్ పైప్ లైన్ ఎవరి పొలాల్లో అయితే వెళ్తుందో ఆ రైతులను పిలిచి మీటింగ్ పెట్టడం జరిగింది.ఈ మీటింగ్ లో రైతులు తమ సమస్యలను తెలియజేశారు. వారు తెలియజేసిన సమస్యలను జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళనున్నాము . ఈ సమావేశంలో భూసేకరణకు సంబంధించి రైతులు నష్టపరిహారం విషయమై మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారి ఏపీ ఐ ఐ సి జోనల్ మేనేజర్ కర్నూలు తహసిల్దార్ రైతులు పాల్గొన్నారు

# ప్రవక్త బోధనలు శాంతికి మార్గం





**కర్నూలు ప్రతినిధి మార్చి 25 ( రిపబ్లిక్ న్యూస్):** మాజీ ఎమ్మెల్యే మరియు కర్నూల్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి,కర్నూలు మాజీ ఎమ్మెల్యే మరి కర్నూలు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి నగరంలోని 46వ వార్డ్ అమీరుద్దీన్ మసీద్ షాహిద్ భాష సలీం బాయ్ ఇర్ఫాన్ భాయ్ మరియు మిత్ర బృందం ఆహ్వానం మేరకు ఇఫ్తార్ కు హాజరై ప్రార్థనలో పాల్గొన్నారు గరీబ్ భాషా స్వగృహం నందు దావత్ లో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి శాంతి సందేశాన్ని ఇచ్చారని అదేవిధంగా చెడుపై యుద్ధం ప్రకటించారని తెలిపారు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ నగర చేనేత నగర అధ్యక్షుడు నీలకంటూ జిల్లా ఆక్టివిటీ సెక్రటరీ లాజర్ మల్లి పరశురాం ఏసు వానేష్ మరియు సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గార్గేపురం లో గవర్నమెంట్ హైస్కూల్లో పోక్సో యాక్ట్ పై న్యాయ విజ్ఞాన సదస్సు



**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**



న్యాయ సేవా అధికార సంస్థ గార్గేయపురం నందు గల గవర్నమెంట్ హై స్కూల్ లో పోక్సో యాక్ట్ పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అధితిగా. రాజేంద్ర బాబు, స్పెషల్ జిల్లా జడ్జి ఫర్ పోక్సో కేసెస్, కర్నూలు హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతు అక్కడి పిల్లలకు, అంగన్వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీస్ లకు పోక్సో యాక్ట్ పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లల పై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.ఈ పోక్సో కేసుల ను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్ట్ కలదని ఆ కోర్ట్ కు నేనే జడ్జి నని తెలిపారు. పిల్లలకు ఏదయినా సమస్య వస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్. 1098 కి కాల్ చేసి చెప్పవచ్చు నని తెలిపారు. ఈ సదస్సు లో తాలూక ఏ.ఎస్. ఐ. గోపాల్, హెడ్ మాస్టర్ వెంకట రాముడు, వార్డెన్ మదారి, ఐసీడీస్ సూపర్ వైజర్స్ విజయ లక్ష్మి, పద్మావతి,టీచర్స్ శారద, లక్ష్మి దేవి పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు శక్తి యాప్

**మీ భద్రత మా భాధ్యత.. మీ రక్షణే మా ధ్యేయం. -కర్నూలు శక్తి టీం పోలీసుల భరోసా.**

**కర్నూలు ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్)**
అత్యవసర సమయంలో మహిళలు శక్తి SOS యాప్ వినియోగించుకోవాలని, ఈ యాప్ మహిళల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు.
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు మహిళా పియస్ డిఎస్పీ శ్రీనివాసాచారి పర్యవేక్షణలో మహిళా పియస్ సిఐ విజయలక్ష్మీ ఆధ్వర్యంలోకర్నూలు , సుంకేశుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు.
ప్రతీ మహిళ శక్తి యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి మొబైల్ కంట్రోల్ రూమ్‌కి కనెక్ట్ అవుతుందన్నారు. ప్రమాదంలో కానీ అత్యవసర సమయాల్లో మొబైల్ ను 5 సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు.దగ్గర్లోని పోలీసులు 5 నిమిషాల్లో బాధిత మహిళల వద్దకు వచ్చి సహాయం చేస్తారని వెల్లడించారు. అంతేకాకుండా ఈ యాప్ లో ఇంట్లో నుంచే ఫిర్యాదు చేయవచ్చన్నారు.మహిళల భద్రతకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు.




శక్తి టీం యొక్క పనితీరు, శక్తి SOS యాప్ యొక్క ఉపయోగాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్, డయల్ 112, 181, చైల్డ్ లైన్ 1098 , కర్నూలు పోలీసు వాట్సప్ 7777877700, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెం 1930 యొక్క ఉపయోగాలు , ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, మొదలైన విషయాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ పియస్ సిఐ విజయలక్ష్మీ, శక్తి టీమ్ సిబ్బంది, కర్నూలు సెయింట్ జోసఫ్




కళాశాల ప్రిన్సిపల్ Dr. శాంత గారు, లెక్చరర్లు పల్లవి, సునీత విద్యార్థినులు సుమారు 300మంది పాల్గొన్నారు.

### ఈ నెల-22 నుండి ఏప్రిల్-11 వరకు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలలో

# ప్రవేశాల కోసం ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోండి

**:-ముడియాల. వెంకటరమణారెడ్డి(మాజీ సైనికుడు , ప్రముఖ సమాజ సేవకుడు)**

పాములపాడు మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- పాములపాడులోని సేవా భారతి వై ఆర్ డి ఎస్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ఇండియన్ ఆర్మీ మాజీ సైనికుడు %ఏ% ప్రముఖ సమాజ సేవకుడు ముడియాల.వెంకటరమణారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ సమాజ సేవకుడు ఎం.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 352, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ(కేజీబివి)లలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6,11 తరగతుల ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల(ఖాళీ సీట్ల కొరకు) మిడిల్ స్కూల్ పిల్లల బడి కోసం ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయనీ, సమగ్ర శిక్ష ఎస్పిడీ- బి.శ్రీనివాసులు(ఐఏఎస్) ఒక ప్రకటనలో



తెలిపారన్నారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ మార్చి-22 నుండి ఏప్రిల్ -11 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు చేసుకోవడానికి ఎవరో అర్హులు అంటే ఆదివాసి, బడి మానుకోని పిల్లలు, డ్రోపౌట్స్ (బడి మానేసిన వారు), ఎన్ఆర్ఐ, ఎన్టిఏసి, బిసి, మైనారిటీ, బిఇడి. ఎడ్ బాలికలు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆన్లైన్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు కోటా వర్తించవలసి ఉంటుందనీ తెలిపారు. మీ దరఖాస్తులు **https://apkgbv.apcfss.in/** లింక్ ద్వారా అప్లై చేసుకోవచ్చు అన్నారు.
ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య బోధన, వసతి, భోజనము, మెనుతో పాటు సమగ్రంగా అందజేయబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత మండలాల విద్యాధికారులు (ఎంఈఓ)లను గాని, మీకు దగ్గరలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల(ఎస్ ఓ) స్పెషల్ ఆఫీసర్లను గాని సంప్రదించండి అన్నారు. లేదా రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయ నంబర్లకు 7075159996, 7075039990 సంప్రదించవచ్చని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

## మోటార్ సైకిల్ ని ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిన కారు

బండి ఆత్మకూరు, మార్చి 25, (రిపబ్లిక్ న్యూస్):- మండల పరిధిలోని నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలో సంత జుటూరు సమీపాన రోడ్డు ప్రమాదం జరిగి ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం పెద్దనాగులవరం గ్రామానికి చెందిన వెంకట నాగరాజు 21 అనే యువకుడు మోటార్ సైకిల్ పై వెలుగోడు వైపు నుండి నంద్యాలకు వెళ్లే క్రమంలో అటువైపు నుంచి వస్తున్న ఏపీ 39 ఎన్ టి 4287 నెంబర్ గల మహేంద్ర ఎక్స్ యువీ కారు ప్రమాదవశాత్తు బైకును ఢీకొట్టడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడనీ తెలిపారు. అయితే డ్రైవర్ కారును అతివేగంగా,అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ప్రమాదం జరిగిన తర్వాత ఆ డ్రైవర్ కార్ ను కూడా ఆపకుండా పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. విషయం



ఘటన స్థలంలో ఏఎస్ఐ అక్బర్

తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వెంటనే అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి ప్రమాదానికి గల కారును గుర్తించినట్లు వెల్లడించారు. కాగా మృతుడు ఒక ప్రైవేటు సంస్థలో లోన్ రికవరీ ఏజెంట్గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఆ యువకుడు ఇక్కడికి



సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన ప్రమాదానికి కారణం అయిన కారు

మోటార్ సైకిల్ పై వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగి ఆ యువకుడు మృత్యువాత పడ్డాడు. కొడుకు మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మిగతాజీవిగా పడి ఉన్న తమ కుమారుని చూసి లబోదిపోమంటూ బోరుణ వినిపించారు. మృతుని తండ్రి చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

**భక్తులకు అసౌకర్యం కలగకూడదు -నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**

నంద్యాల క్రైం, మార్చి 25, (రిపబ్లిక్ న్యూస్): శ్రీశైలంలో ఉగాది పండుగ సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా భద్రత ఏర్పాట్ల పై బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి పలు అంశాలపై సూచనలు చేస్తూ బ్రీఫింగ్ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు కేటాయించిన ప్రాంతాలలో భాద్యతయుతంగా విధులు నిర్వహించాలి. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా సమర్థవంతంగా పని చేయాలన్నారు. మీకు అప్పగించిన విధులలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి





శ్రీశైలంలో ఉగాది పండుగ సందర్భంగా బందోబస్తు నిమిత్తం వచ్చిన సిబ్బందికి బ్రీఫింగ్ చేస్తున్న జిల్లా ఎస్పీ

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ చంద్రబాబు, ఆత్మకూరు డిఎస్పి రామాంజీ నాయక్ ఉన్నారు.

# వేసవి ఊర్తయ్యే వరకు కాల్ సెంటర్లు




అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:- వేసవి నీటి ఎద్దడిపై సీఎం చంద్రబాబు ఆయా జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవి పూర్తయ్యే వరకు జిల్లాల్లో కాల్‌సెంటర్లు పెట్టుకోవాలని.. తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీళ్ల సమస్యలపై జీపీఎస్ రియల్ టైమ్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో ఆదేశించారు.

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు ఎక్కడైనా సరే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనికోసం వేసవి కాలం పూర్తయ్యేవరకు జిల్లాలో తాత్కాలిక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంచినీళ్ల సమస్య ఎక్కడైనా తలెత్తినా దాన్ని రియల్ టైమ్‌లో పర్యవేక్షించి పరిష్కరించాలని సీఎం చంద్రబాబు అన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను అన్నింటిని నీటితో నింపాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు తాగునీరు అందించే ఏర్పాట్లకు సంబంధించి ఎక్కడా కూడా నిధులకు కొరత లేదని, జిల్లా కలెక్టర్లు దీనిపైన ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వేసవి నీటి ఎద్దడి ఎదుర్కోవడంలో హేతుబద్ధంగా పనిచేయాలని, అప్పుడే ప్రజలు మన పనులను హర్షిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలో పీఎం సూర్య ఘర్ పథకంపై కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆ ప్రకారం ఈ ఏడాది ఏపీలో 20 లక్షల రూఫ్ టాఫ్ సోలార్ యూనిట్లు- ఏర్పాటు- చేసే దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తమ ప్రభుత్వంలో బడుగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పీ4లో భాగంగా సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. డ్వాక్రా, మహిళా సంఘాల ద్వారా పేదలను గుర్తించి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదాన్ని ముందుకు తీసుకొచ్చామన్నారు. గిరిజన సంక్షేమంలో భాగంగా ఆరకు కాఫీని ప్రోత్సహించాలని నిర్ణయించామని సీఎం తెలిపారు. వచ్చే ఐదేళ్లలో అదనంగా లక్ష ఎకరాల్లో అరకు కాఫీ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించామన్నారు. కాఫీ సాగులో అంతరపంటగా వేసే నల్ల మిరియాలు, స్ట్రాబెర్రీ, అవకాడో, యాపిల్, జీడి వంటి పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు.

గిరిజన ఉత్పత్తుల పరిరక్షణకు అవసరమైతే డ్రోన్ - టె-క్నాలజీని వాడుకోవాలన్నారు. సేంద్రియ సేద్యానికి అరకులో మంచి అవకాశాలు ఉన్నాయని సీఎం చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వనరులు ఉన్నాయని, ఆదివాసీల్లో చైతన్యం లేకే వెనకబడి ఉన్నారని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో సొంత ఇల్లు లేని వారు ఎవరూ ఉండకూడదని సీఎం నిర్ణయించారు. వచ్చే నాలుగేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇచ్చేలా కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. పట్టణాల్లో రెండు సెంట్లు-, గ్రామాల్లో 3 సెంట్లు- చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు.

# నవోదయ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన సన్ షైన్ స్కూల్ విద్యార్థులు

- ముగ్గురు విద్యార్థులకు నవోదయలో సీట్లు
- నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం అంటున్న పాఠశాల యజమాన్యం








**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 25 (రిపబ్లిక్ న్యూస్):-**
ఇచ్చోడ మండల కేంద్రంలోని సన్ షైన్ స్కూల్ విద్యార్థులు మంగళవారం వెలువడిన నవోదయ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. ఏకకాలంలో ఒకే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నవోదయలో సీటు సాధించి అందరి అభినందనలు పొందుతున్నారు. సన్ షైన్ పాఠశాలలో విద్యా అభ్యసించే పాముల సిద్ధార్థ అంబేద్కర్, పాముల గౌతం కృష్ణ, చౌహాన్ పృధ్వీరాజ్ అనే విద్యార్థులు నవోదయాలో సీటు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

**నాణ్యమైన విద్య అందించడమే సన్ షైన్ లక్ష్యం..** ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం , పెద్ద పెద్ద పట్టణాలలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం తెలిపింది. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దడం కోసం పాఠశాల సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని.. రానున్న రోజుల్లో నవోదయ తో పాటు సైనిక్ స్కూల్ లలో అధిక సీట్లు తమ విద్యార్థులు సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు యజమాన్యం తెలిపింది.

# ఎస్ఎల్‌బీసీ ఘటనలో మరో మృతదేహం లభ్యం



మహబూబ్‌నగర్,మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం డెడ్‌బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

# రామ్ చరణ్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

## నేడు ప్రతి మెగా అభిమాని రక్తదానం చేసి చిరంజీవి ఆశయానికి కృషి చేయాలి




నంద్యాల, మార్చి 25, (రిపబ్లిక్ న్యూస్): ఈనెల 27వ తేదీ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా నంద్యాలలో సేవా కార్యక్రమాలను నిత్యం చేయాలని చిరంజీవి ఆశయాన్ని పుణికిపుచ్చుకున్న మన మెగా అభిమానులు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్న సంకల్పంతో రక్తదానం పైన ఉన్న అపోహలను తొలగించడానికి సరైన సమయంలో రక్తం దొరకక ఇబ్బందులు పడుతున్న వారిని రక్షించడం కోసం చేసినటువంటి చిన్న లఘు చిత్రం, ప్రతి ఒక్కరు తిలకించగలరు. నేడు 26-03-2025 తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు నంద్యాల బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయబడినది ప్రతి ఒక్క మెగా అభిమాని, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు,పాల్గొని విజయవంతం చేయగలరనీ మా ప్రేమ పూర్వక పిలుపునిచ్చారు.

# ఒకవైపు ఎండలు.. మరోవైపు వర్షాలు


## తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం



హైదరాబాద్, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం కొనసాగుతోంది.. ఓ వైపు ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మరోవైపు అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి.. ఓ వైపు ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు.. రెండు మూడు రోజుల నుంచి తగ్గిన ఉష్ణోగ్రతలతో కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అలాగే.. కొన్ని ప్రాంతాల్లో ద్రోణి ప్రభావంతో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.. తెలంగాణలో 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశ ముందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుండి మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక మీదుగా ఉత్తర కేరళ వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుంది.. ఆ తరువాత క్రమేపి రెండు నుండి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ రోజు గరిష్టంగా అదిలాబాద్ లో 38.3 కనిష్టంగా హైదరాబాద్ లో 33.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం, మహబూబ్ నగర్ లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఆదిలాబాద్..38.8, నిజామాబాద్..37.8, భద్రాచలం..37.2, ఖమ్మం..37.2, మహబూబ్ నగర్..35.6, నల్లగొండ..35.5, రామగుండం..35, మెదక్..34.6, హనుమకొండ..34.5, హైదరాబాద్..33.6 డిగ్రీల పగలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. ఏపీలో ఠారెత్తిస్తున్న ఎండలు.. మంగళవారం ఏపీలోని 52 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. నేడు శ్రీకాకుళం జిల్లా -8, విజయనగరం జిల్లా-10, పార్వతీపురంమన్యం జిల్లా-12, అల్లూరి సీతారామరాజు జిల్లా-6, కాకినాడ-5, తూర్పుగోదావరి-6, ఏలూరు-2, ఎన్టీఆర్ జిల్లా 3 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉంది. సోమవారం అనంతపురం జిల్లా నాగసముద్రంలో 39.9ీ%జ%, వైఎస్సార్ జిల్లా అట్లూరు 39.8, చిత్తూరు జిల్లా నింద్ర 39.7ీ%జ%, నంద్యాల జిల్లా దొర్నిపాడు 39.6ీ%జ%, ప్రకాశం జిల్లా గుంటుపల్లి 39.2 అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. అలాగే మూడు మండలాల్లో వడగాల్పులు వీచాయి. వేసవి అకాల వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమరావతి వాతావరణ కేంద్రం సూచించింది.

# శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం.

## దేవనకొండ పోలీసుల ఫ్లాగ్ మార్చ్.



**దేవనకొండ మార్చి 25 ( రిపబ్లిక్ న్యూస్ ) :**
కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారి ఆదేశాల మేరకు పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య పర్యవేక్షణలో దేవనకొండ సిఐ వంశీనాథ్ ఆధ్వర్యంలో దేవనకొండ పోలీసులు పి. కోటకొండ గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా దేవనకొండ మండలం, పి.కోటకొండ గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర జరుగుతున్న సంధర్బంగా పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు దేవనకొండ సిఐ వంశీనాథ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు, ప్రజల భద్రతే ముఖ్యంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు , ప్రజలకు నిత్యం అందుబాటులో పోలీసులు ఉంటారని, భరోసా కల్పించడానికి, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో దేవనకొండ సిఐ తో పాటు 80 మంది పోలీసులు పాల్గొన్నారు.

## ఎంఎంటీఎస్ అత్యాచారయత్నం ఘటనలో

# అనుమానితుడు గుర్తింపు

**మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామానికి చెందిన మహేశ్‌గా గుర్తింపు**

**ఫొటో చూపించగా సరిగ్గా గుర్తించలేకపోయిన బాధితురాలు**

**నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**




హైదరాబాద్, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
ఎంఎంటీఎస్ రైలులో జరిగిన అత్యాచారయత్నం ఘటనకు సంబంధించి పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడు మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామానికి చెందిన జంగం మహేశ్ అని గుర్తించారు. పోలీసులు నిందితుడి ఫొటోను బాధితురాలికి చూపించగా, ఆమె స్పష్టంగా గుర్తుపట్టలేకపోయినట్లు సమాచారం. విచారణలో మహేశ్‌ను ఏడాది క్రితం అతని భార్య వదిలి వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. అతని తల్లిదండ్రులు కూడా మరణించారు. ఒంటరిగా ఉంటున్న మహేశ్ గంజాయికి బానిసయ్యాడని, అతడు గతంలో నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మూడు రోజుల క్రితం తెల్లాపూర్-మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలులో మహిళల బోగిలో ఒంటరిగా ఉన్న బాధితురాలిపై ఒక యువకుడు అత్యాచారయత్నం చేయగా, ఆమె కొంపల్లి సమీపంలో రైలు నుంచి దూకి తప్పించుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను తొలుత గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం, మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తరలించారు.

# ఆస్తి పన్ను బకాయి వడ్డీ బకాయిల్లో 50 శాతం రాయితీ ప్రకటించిన మున్సిపల్ శాఖ

**ప్రజల నుంచి వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన**

**కోట్లాది రూపాయల బకాయిలు వసూలు అవుతాయని భావిస్తున్న ప్రభుత్వం**

అమరావతి, మార్చి 25 రిపబ్లిక్ న్యూస్:-
ఆస్తి పన్ను బకాయి ఉన్న వారికి ఏపీలోని కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పన్ను బకాయిదారులకు రాయితీ ప్రకటిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా పన్ను చెల్లించేవారికి వడ్డీ బకాయిల్లో 50 శాతం రాయితీ ప్రకటిస్తూ జీవో విడుదల చేసింది. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ నిర్ణయంతో కోట్లాది రూపాయల బకాయిలు వసూలు అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో పన్ను బకాయి పడ్డవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# సెంట్రల్ కాంట్రాక్ట్‌లో రోహిత్, విరాట్‌కు డిమోషన్

## త్వరలో బీసీసీఐ వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్‌లు

దేశవాళీ క్రికెట్ ఆడనందున టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను బీసీసీఐ గతేడాది సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించింది. అయితే ఇటీవల కాలంలో శ్రేయస్ దేశీయ టోర్నీలు, అంతర్జాతీయ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో 243 రన్స్ బాది భారత్ తరఫున ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో శ్రేయస్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను బీసీసీఐ మళ్లీ పునరుద్ధరించనున్నట్లు తెలుస్తోంది. ఏ ఆటగాడు అయినా సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి రావాలంటే ఒక నిర్దిష్ట క్యాలెండర్ ఇయర్‌లో మూడు టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడాలి. శ్రేయస్ అయ్యర్ ఈ సీజన్ లో 11 మ్యాచ్‌లు ఆడాడు. కాబట్టి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో అతడ్ని తీసుకోవచ్చని తెలుస్తోంది. అయితే టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గంభీర్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వంటివారు అంగీకారం తెలిపితేనే శ్రేయస్‌కు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కే అవకాశం ఉంది. భారత మహిళల జట్టు సెంట్రల్ కాంట్రాక్ట్‌లను బీసీసీఐ సోమవారం ప్రకటించింది. మరికొద్ది రోజుల్లో టీమ్ ఇండియా పురుషుల జట్టు కేంద్ర కాంట్రాక్ట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఏం కేటగిరీలో ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జడేజా అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పేశారు. దీంతో వారి సెంట్రల్ కాంటాక్ట్ కేటగిరీ కేటాయింపులపై బీసీసీఐ సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. బుమ్రాను %ూ%ం కేటగిరీలో కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఏ కేటగిరీలో ఉన్న అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పేశాడు. దీంతో అతడిని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. అలాగే టీమ్‌ఇండియా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ వన్డే, టీ20ల్లో రెగ్యులర్ ప్లేయర్‌గా ఉన్నాడు. ఇప్పటివరకు 14 టెస్టులు కూడా ఆడాడు. అన్ని ఫార్మాట్లలోనూ బ్యాట్, బాల్‌తో ఫర్వాలేదనిపిస్తున్నాడు. ఈ క్రమంలో అక్షర్ పటేల్‌ను బీ కేటగిరీ నుంచి ఏకి ప్రమోట్ చేసే అవకాశం ఉంది. యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ తన గ్రేడ్ బీ కాంట్రాక్ట్ నుంచి పదోన్నతి పొందుతాడా లేదా చూడాలి. ఈ క్యాలెండర్ ఇయర్‌లో 7 టెస్టులు ఆడిన పేసర్ ఆకాశ్ దీప్, 3 మ్యాచ్‌లు ఆడిన సర్ఫరాజ్ ఖాన్‌ను గ్రూప్ సీలో చేర్చే అవకాశం ఉంది. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో రాణించిన నితీశ్ కుమార్ రెడ్డి కూడా ఈ సారి సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు అవకాశం ఉంది. శార్దూల్ ఠాకూర్, రుతురాజ్ గైక్వాడ్ గతేడాది సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. కానీ ఈ ఏడాది వారు సెంట్రల్ కాంట్రాక్ట్ పొందేందుకు కనీస మ్యాచ్‌లను ఆడలేదు. దీంతో వారికి ఈ ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్‌లు దక్కుతాయా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

# పంజాబ్ కింగ్స్ విజయం



### శ్రేయాస్ త్రుటిలో సెంచరీ మిస్ -పోరాడి ఓడిన గుజరాత్

అహ్మదాబాద్: ఉత్కంఠ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్‌లో శుభారంభం చేసింది. శ్రేయాస్ అయ్యర్ (42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 నాటౌట్) బ్యాట్‌తో చెలరేగితే.. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పేసర్ విజయ్‌కుమార్ వైశాక్ (3-0-28-0) వ్యూహాత్మకంగా ప్రత్యర్థి జోరును అడ్డుకొన్నాడు. దీంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 243/5 స్కోరు చేసింది. ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 47), శశాంక్ సింగ్ (16 బంతుల్లో 44 నాటౌట్) రాణించారు. సాయి కిశోర్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో గుజరాత్ ఓవర్లన్నీ ఆడి 232/5 స్కోరు మాత్రమే చేసింది. సాయి సుదర్శన్ (74), బట్లర్ (54), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (46) పోరాటాలు వృథా అయ్యాయి. అర్ష్‌దీప్ రెండు వికెట్లు పడగొట్టాడు. శ్రేయాస్ అయ్యర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



### ఆఖర్లో.. అలా..:

ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్, కెప్టెన్ గిల్ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, ధాటిగా ఆడుతున్న గిల్‌ను మ్యాక్సీ క్యాచవుట్ చేయడంతో.. ఆరు ఓవర్లకు గుజరాత్ 61/1తో నిలిచింది. అనంతరం బట్లర్‌తో కలిసి సుదర్శన్ స్కోరు బోర్డును నడిపించాడు. ఈ క్రమంలో 10వ ఓవర్‌లో సుదర్శన్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. గుజరాత్ స్కోరు సెంచరీ దాటింది. క్రీజులో కుదురుకొన్న బట్లర్ మ్యాక్సీ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో గేర్ మార్చాడు. అయితే, సుదర్శన్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రూథర్‌ఫోర్డ్ కూడా ధాటిగా ఆడడంతో టైటాన్స్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, 15 ఓవర్‌లో వైశాక్ బౌలింగ్‌కు రావడం మ్యాచ్ గతిని మార్చింది. బ్యాటర్‌కు అందకుండా వ్యూహాత్మకంగా బంతులేసిన వైశాక్.. పరుగుల జోరుకు కళ్లెం వేశాడు. జెన్సన్ కూడా అతడినే అనుసరించడంతో క్రమంగా సాధించాల్సిన రన్‌రేట్ పెరిగింది. విజయానికి 18 బంతుల్లో 57 పరుగులు కావల్సి ఉండగా.. జెన్సన్ బౌలింగ్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న బట్లర్ బౌల్డ్ అయ్యాడు. ఆఖరి ఓవర్‌లో గుజరాత్ గెలుపునకు 27 పరుగులు కావాల్సిన దశలో.. తెవాటియా (6), రూథర్‌ఫోర్డ్‌ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ పంజాబ్‌ను గెలిపించాడు.

# విప్రజ్ నిగమ్ వల్లే ఓడాం

### లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్



యువ ప్లేయర్ విప్రజ్ నిగమ్ అసాధారణ బ్యాటింగ్‌తోనే గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమిపాలయ్యామని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో వైజాగ్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఒక్క వికెట్ తేడాతో ఓటమిపాలైంది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో అనవసర తప్పిదాలతో లక్నో మూల్యం చెల్లించుకుంది. ఢిల్లీ లోయార్డర్ సంచలన బ్యాటింగ్‌తో తీవ్ర ఒత్తిడికి గురైంది.ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన రిషభ్ పంత్.. ఈ ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటామని చెప్పాడు. 'మా టాపార్డర్ బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. ఈ వికెట్‌పై ఇది మంచి స్కోర్. జట్టుగా మేం ప్రతీ మ్యాచ్‌లో సానుకూల అంశాలను తీసుకుంటాం. ప్రతీ మ్యాచ్‌లో తప్పిదాల నుంచి గుణపాఠం నేర్చుకుంటాం. బేసిక్స్ తగ్గట్లు సరిగ్గా ఆడితేనే టీమ్ భవిష్యత్తు కూడా బాగుంటుంది.ఆరంభంలోనే మేం వికెట్లు తీసాం. కానీ ఈ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని మాకు తెలుసు. ఢిల్లీకి రెండు కీలకమైన భాగస్వామ్యాలు దక్కాయి. స్టబ్స్, అషుతోష్‌తో పాటు మరో కుర్రాడు(విప్రజ్ నిగమ్) అద్భుతంగా ఆడాడు. అతనే అసాధారణ బ్యాటింగ్‌తో మా విజయవకాశాలను దెబ్బతీసాడు. మేం ఇంకాస్త మెరుగ్గా మా ప్రణాళికలను అమలు చేయాల్సింది.మేం ఒత్తిడికి లోనయ్యాం. ఇప్పడిప్పుడే సెట్ అవుతున్నాం. ఈ మ్యాచ్‌లో మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో లక్ కూడా కీలక పాత్ర పోషించింది. మోహిత్ శర్మను స్టంపౌట్ చేసే అవకాశం చేజారింది. అయితే క్రికెట్‌లో ఇవన్నీ సహజమే. ఇలాంటి వాటిపై ఫోకస్ పెట్టకుండా మెరుగై క్రికెట్ ఆడాలి.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. ఆఖరి ఓవర్‌లో మోహిత్ శర్మను స్టంపౌట్ చేసే అవకాశాన్ని రిషభ్ పంత్ చేజార్చాడు. ఈ స్టంపౌట్ చేసి ఉంటే ఢిల్లీ ఆలౌటై.. లక్నో గెలిచేది. ఈ మ్యాచ్ ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవరల్లో 8 వికెట్లకు 209 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసింది. అషుతోష్ శర్మ (31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 66 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. విప్రజ్ నిగమ్(15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39), ట్రిస్టన్ స్టబ్స్(22 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 34) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

# అవేశ్ ఖాన్‌కు ఫిట్ సర్టిఫికేట్..

### లక్నో క్యాంప్‌లో చేరేందుకు సిద్ధం



%ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ గైయింట్స్ జట్టు నుంచి గురించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. లక్నో శిబిరంలో చేరడానికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవేష్ ఖాన్(కు ఫిట్ సర్టిఫికేట్ ఇచ్చింది. మోకాలి గాయంతో బాధపడుతున్న ఈ పేసర్ బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షణలో కోలుకున్నాడు. అయితే 28 ఏళ్ల ఈ ఆటగాడు త్వరగా కోలుకుని మార్చి 24న సోమవారం నాడు వైద్య పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. దీంతో అతను తిరిగి క్రికెట్‌లో సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ ఫ్రాంచైజీ కోసం దాదాపు మూడు ఆటలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.అవేశ్ 2025 జనవరి నుంచి ప్రొఫెషనల్ క్రికెట్‌లో పాల్గొన లేదు. బెంగళూరులో తన చికిత్స పూర్తి చేసుకున్న అవేశ్, ఇప్పుడు లక్నో సూపర్ గైయింట్స్ క్యాంప్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు. అయితే, అతను లక్నో జట్టులో ఎప్పుడు చేరుతాడనేది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఈ సీజన్‌లో రిషబ్ పంత్ నాయకత్వంలోని జట్టు మార్చి 27న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కీలక మ్యాచ్ ఆడనుంది. అక్కడ అవేశ్ ఆడతాడా లేదా అనే దానిపై జట్టు నిర్ణయం తీసుకోనుంది.ఈ సీజన్‌లో లక్నో సూపర్ గైయింట్స్ జట్టుకు అనేక ఆటగాళ్లు గాయాలతో బాధపడుతున్నారు. ఇది ఫ్రాంచైజీకి పెద్ద సవాలని చెప్పవచ్చు. జట్టులో అత్యంత ముఖ్యమైన బౌలర్ అయిన మోహ్సిన్ ఖాన్ ఈ సీజన్‌లో భాగంగా అందుబాటులో లేరు. 2025 నుంచి అతను తప్పించబడగా, శార్దూల్ ఠాకూర్‌ను ఆయన స్థానంలో నియమించారు. మోహ్సిన్ ఖాన్‌ను తప్పించి, లక్నో జట్టు కొత్త సభ్యులతో మెరుగైన ప్రదర్శన సాధించాలని ఆశిస్తోంది. అంతేకాదు మయాంక్ యాదవ్ 11 కోట్ల రూపాయలకు అయిన ఈ ఆటగాడు, గాయంతో బాధపడుతున్నాడు. మరోవైపు ఆకాష్ దీప్ కూడా కొన్ని మ్యాచ్‌లకు మిస్ కావచ్చని తెలుస్తోంది.


# కొత్త ఛైర్మన్ .. సెబీ సభ్యుల ఆస్తుల వెల్లడికి ప్రతిపాదన



సెబీ కొత్త ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకుని నెల రోజులు కూడా గడువకముందే తానేంటో చూపిస్తున్నారు తుహిన్ కాంత పాండే( భారత స్టాక్ మార్కెట్లను ముందుకు తీసుకువెళ్లేందుకు చకచకా చర్యలు తీసుకోవడమే కాకుండా సెబీ లో పారదర్శకు పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెబీ చైర్మన్ పాండే సూపరంటూ మార్కెట్ వర్గాల్లో ప్రశంసలు వెల్లివిరుస్తున్నాయి. తాజాగా సెబీ సభ్యుల ఆస్తుల వెల్లడికి ప్రతిపాదించారు పాండే. సెబీ బోర్డు సభ్యులు, అధికారుల ఆస్తులు, అప్పుల వివరాలు తెలియజేసేలా సమగ్ర నిబంధనలపై సమీక్ష నిర్వహించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు.అదానీ గ్రూప్ వ్యవహారంలో సెబీ మాజీ ఛైర్‌పర్సన్ మాధవిపురి బచ్‌పై గతంలో ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారుల లావాదేవీల్లో పారదర్శకత కోసం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పాండే తెలిపారు. దీనివల్ల ఇక మీదట అధికారులు, ఇతర సెబీ సిబ్బంది తమ ఆస్తులు, అప్పులు, పెట్టుబడులకు సంబంధించి వివరాల వెల్లడి చేయాల్సి ఉంటుంది. సిబ్బంది పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధనలపై కమిటీ క్లారిటీ ఇవ్వబోతోంది.సెబీపై మరింతగా విశ్వాసం పెంపొందించాలంటే ఈ నిబంధనలను సమీక్షించాలని పాండే కృతనిశ్చయంతో ఉన్నారు. అంతేకాదు బోర్డు సభ్యులు, అధికారుల నైతిక ప్రవర్తన, జవాబుదారీతనం, పారదర్శకతను నెలకొల్పాలన్నదే ఈ కమిటీ ఉద్దేశమని పాండే స్పష్టం చేశారు.

**ఏటీఎం సేవలు మరింత ప్రియం... మే 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు!**

ఏటీఎం సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఎందుకంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏటీఎం ఇంటర్‌చేంజ్ ఫీజుల పెంపునకు ఆమోదించింది. ఇకపై ఆర్థిక లావాదేవీల కోసం ఏటీఎంలపై ఆధారపడే వినియోగదారులు వారి ఉచిత లావాదేవీ పరిమితిని దాటిన తర్వాత అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. మే 1 నుంచి కొత్త ఏటీఎం నిబంధనలు అమల్లోకి రానున్నాయి.
ఆర్‌బీఐ ఇంటర్‌చేంజ్ ఫీజులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై ఇతర బ్యాంకు ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేస్తే అదనంగా డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఆర్థిక లావాదేవీలకు రూ. 2, ఆర్థికేతర లావాదేవీలకు రూ. 1 మేర ఇంటర్‌చేంజ్ ఫీజు పెంపునకు ఆర్‌బీఐ ఆమోదించింది. ఈ కొత్త ఛార్జీలు మే 1 నుంచి అమల్లో రానున్నాయి. పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు తమ వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్నాయని వాదించిన వైట్-లేబుల్ ఏటీఎం ఆపరేటర్ల అభ్యర్థనల మేరకు ఆర్‌బీఐ ఈ ఛార్జీలను సవరించాలని నిర్ణయించింది.ఏటీఎం ఇంటర్‌చేంజ్ ఫీజు అంటే ఒక బ్యాంకు ఏటీఎంను వేరే బ్యాంక్ కస్టమర్ ఉపయోగిస్తే ఆ బ్యాంకుకు చెల్లించాల్సిన ఫీజు. సాధారణంగా ఇది మొత్తం లావాదేవీలో 1 శాతం ఉంటుంది. ఇప్పుడు ఆర్‌బీఐ ఈ ఫీజుల్ని సవరించడంతో ఇంటర్‌చేంజ్ రూ. 17 నుంచి రూ. 19కు పెరిగింది. ఖాతా బ్యాలెన్స్‌ల తనిఖీ వంటి సేవలకు రూ. 6 నుంచి రూ. 7కు పెంచారు. ప్రస్తుతం మెట్రో ప్రాంతాల్లో ఒక బ్యాంకు కస్టమర్ ఇతర బ్యాంకు ఏటీఎంలను నెలలో ఐదు సార్లు ఫ్రీగా వాడవచ్చు. నాన్ మెట్రో ప్రాంతాల్లో నెలకు 3 ఉచిత అవకాశాలు మాత్రమే ఉంటాయి. ఈ పరిమితులు దాటితే ఇంటర్‌చేంజ్ ఫీజు పడుతుంది. ఇక ఇండియాలో డిజిటల్ చెల్లింపుల విలువ 2014 ఆర్థిక సంవత్సరంలో రూ. 952 లక్షల కోట్లుగా ఉందని ప్రభుత్వ డేటా పేర్కొంది. అయితే, 2023 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య రూ.3,658 లక్షల కోట్లకు పెరిగింది.



# వార్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు...
# క్షమాపణలు చెప్పిన రాజేంద్ర ప్రసాద్



నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ నెల 28న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మేకర్స్ ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నాడు హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసీస్ మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథిగా విచ్చేశాడు.

అయితే, రాబిన్‌హుడ్ ఈవెంట్‌లో వార్నర్‌పై సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మాజీ క్రికెటర్‌ను ఉద్దేశించి నటకిరీటి చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. దీంతో నెటిజన్లు ఆయనపై దుమ్మెత్తిపోశారు. ఈ నేపథ్యంలో తాను వార్నర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజేంద్ర ప్రసాద్ స్పందించారు. తాను ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావని, తన మాటలు ఎవరినైనా నొప్పిస్తే సారీ అని అన్నారు.

"నా ప్రాణానికి ప్రాణమైన తెలుగు ప్రేక్షక దేవుళ్లు అందరికీ నమస్కారం. మొన్న రాబిన్‌హుడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డేవిడ్ వార్నర్ మీద నా నోటి నుంచి అనుకోకుండా ఓ మాట దొర్లింది. అది నేను ఉద్దేశపూర్వకంగా చేసింది మాత్రం కాదు. నా గురించి మీకు తెలియనిది కాదు. ఆ ఫంక్షన్‌కి వచ్చే ముందు మేమంతా కలిసున్నాం. ఎంత అల్లరి చేశామంటే... నితిన్‌ని, అతడ్ని (వార్నర్ ని) మీరంతా నా పిల్లల్లాంటోళ్లు అన్నా.

అనేసి ఊరుకోకుండా నేను వార్నర్‌ని గట్టిగా వాటేసుకొని నువ్వు యాక్టింగ్‌లోకి వస్తున్నావ్‌గా రా నీ సంగతి చెప్తా అన్నా. దానికి మీరు క్రికెట్‌లోకి రండి మీ సంగతి చెప్తా అని



వార్నర్ అన్నాడు. ఇలా చాలా అల్లరి చేసి ఆ ఫంక్షన్‌కి వచ్చాం. ఏది ఏమైనా ఐ లవ్ వార్నర్. ఐ లవ్ హిజ్ క్రికెట్. అలానే వార్నర్ మన సినిమాల్ని.. మన యాక్టింగ్‌ని చాలా ఇష్టపడతాడు. నాకు తెలిసి మేము ఒకరికి ఒకరం బాగా క్లోజ్ అయిపోయాం. ఏది ఏమైనా జరిగిన సంఘటన మీ మనసుల్ని బాధ పెట్టి ఉంటే నన్ను క్షమించండి. నేను ఉద్దేశపూర్వకంగా అన్నది కాదు. అయినా కూడా నేను సారీ చెబుతున్నా. అలాంటిది ఇంకెప్పుడూ జరగదు. జరగకుండా చూసుకుందాం" అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.



# జాట్ సర్ ప్రైజ్ కోసం ఇస్మార్ట్ పాప

బాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన యాక్షన్ మూవీ 'జాట్' లో ఒక్కొక్కటిగా ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ బైటకు వస్తున్నాయి. సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి ఇప్పటికే భారీ క్రేజ్ ఏర్పడింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు థమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి ఈ చిత్రంలో క్రేజీ విలన్‌గా రణ్‌దీప్ హుడా లుక్‌కి మంచి రెస్పాన్స్ రావడంతో పాటు, ఇటీవల విడుదలైన ట్రైలర్ కూడా ట్రేండింగ్ లో నిలిచింది. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా, వినీత్ కుమార్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తుండగా.. బాక్సాఫీస్ వద్ద సన్నీ డియోల్ కి ఇది ఓ మాస్ రీ ఎంట్రీ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.ఇక తాజా అప్‌డేట్ ప్రకారం టాలీవుడ్ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ ఈ సినిమాలో ఓ స్పెషల్ ఐటెమ్ సాంగ్‌లో నటించబోతున్నట్లు సమాచారం. ఈ మేరకు చిత్ర బృందం ఒక స్పెషల్ మాస్ నెంబర్ రూపొందించిందట. బాలీవుడ్ స్టార్ హీరో మూవీగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నభా కనిపించడం ఆమె కెరీర్‌కి కొత్త దిశగా మారవచ్చునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇస్మార్ట్ శంకర్ అనంతరం ఆమెకు సరైన సక్సెస్ రాలేదు. దీంతో ఈ స్పెషల్ సాంగ్ ద్వారా అటు బాలీవుడ్‌లో, ఇటు సౌత్‌లో తిరిగి ఫోకస్ లోకి వచ్చేందుకు ఇది బెస్ట్ ఛాన్స్ కావొచ్చని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. కరోనా తర్వాత ఒకసారి రోడ్డు ప్రమాదానికి గురై సినిమాల నుంచి బ్రేక్ తీసుకున్న నభా, ఇటీవలే 'డార్లింగ్' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆ సినిమా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది.దీంతో మరోసారి గ్లామర్‌కు ప్రాధాన్యత ఇచ్చే పాత్రలవైపు ఆమె ఫోకస్ పెంచింది. ఇప్పుడు జాట్ మూవీ ఐటెమ్ సాంగ్‌తో వచ్చిన ఈ అవకాశాన్ని నభా ఎంతవరకు వినియోగించుకుంటుందనేదే ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాను ఏప్రిల్ 10న భారీ స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. మాస్ యాక్షన్, హారర్ థ్రిల్ మిక్స్‌తో వస్తున్న ఈ సినిమాలో అన్ని కమర్షియల్ అంశాలూ బలంగా ఉన్నట్లు ఇప్పటికే విడుదలైన కంటెంట్ ఆధారంగా తెలుస్తోంది. నభా నటేష్ స్పెషల్ సాంగ్ కూడా సినిమాకి హైలైట్ అవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మరి ఈ పాటతో నభాకు మళ్లీ క్రేజ్ వస్తుందా.. లేదంటే మరో గ్లామర్ గెస్ట్ గా మిగిలిపోతుందా అన్నది రిజల్ట్ తర్వాత తేలనుంది.



# ప్రభాస్ కు ఫిదా అయిపోయా మాళవిక మోహనన్

ఈ సినిమాను జీవితాంతం గుర్తుంచుకుంటానన్న మాళవిక

కేరళ భామ మాళవిక మోహనన్ దక్షిణాదిన హీరోయిన్ గా మంచి గుర్తింపును తెచ్చుకుంది. 2013లో మలయాళ సినిమా 'పెట్టం పోలె'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక... మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో నటించింది. ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ కు జోడీగా 'ది రాజాసాబ్' సినిమాలో నటిస్తోంది. దీనికి తోడు 'సర్దార్ 2' అనే తమిళ సినిమా చేస్తోంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ ప్రభాస్ పై ప్రశంసల వర్షం కురిపించింది. ప్రభాస్ మంచితనం, సహృదయతకు ఫిదా అయిపోయానని చెప్పింది. ప్రభాస్ వంటి గొప్ప వ్యక్తితో నటించడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపింది. ఈ సినిమాలో ఛాన్స్ రావడాన్ని లక్కీగా భావిస్తున్నానని... ప్రభాస్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి మించిన ఆనందం ఏముంటుందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ సినిమాను జీవితాంతం గుర్తుంచుకుంటానని చెప్పారు. మరోవైపు హారర్ కామెడీ థ్రిల్లర్ గా 'ది రాజా సాబ్' తెరకెక్కుతోంది.

# బాలీవుడ్ నిర్మాతలు తెలుగు చిత్ర పరిశ్రమను చూసి నేర్చుకోవాలి

**: సన్నీ డియోల్**





ప్రముఖ బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ టాలీవుడ్‌లో స్థిరపడాలని ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో నటీనటులను గౌరవించే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని అన్నారు.సన్నీ డియోల్... టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'జాట్' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్ర ప్రమోషన్ ఈవెంట్ లో సన్నీడియోల్ మాట్లాడుతూ, టాలీవుడ్ నిర్మాతల నుంచి బాలీవుడ్ నిర్మాతలు ఎన్నో విషయాలు నేర్చుకోవాలని సూచించారు. దక్షిణాదిలో నటీనటులను గౌరవించే విధానం, సినిమా నిర్మాణంలో వారికున్న స్పష్టత బాలీవుడ్‌కు ఆదర్శనీయమని ఆయన అభిప్రాయపడ్డారు.టాలీవుడ్‌తో కలిసి పనిచేయడం తనకు ఎంతో నచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని దక్షిణాది చిత్రాల్లో నటించాలని ఉందని సన్నీడియోల్ అన్నారు. ఒకప్పుడు బాలీవుడ్‌లో దర్శకులు చెప్పినట్లు నిర్మాతలు చేసేవారని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని, కమర్షియల్ అంశాలకే ప్రాధాన్యతనిస్తుండటంతో ప్రేక్షకులు బాలీవుడ్ సినిమాలపై ఆసక్తి కోల్పోయారని ఆయన విశ్లేషించారు.సన్నీడియోల్ నటిస్తున్న 'జాట్' చిత్రంలో సయామీ ఖేర్, రెజీనా కథానాయికలుగా నటిస్తున్నారు. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.

# పవన్‌కళ్యాణ్ గురువు కన్నుమూత : హుసైనికి పవన్ నివాళి


%చెన్నై: ప్రముఖ సినీ నటుడు, కరాటే మాస్టర్ షిహాన్ హుసైని(60) మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఎపి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఆయన మార్షల్ ఆర్ట్స్‌లో ఆయన శిక్షణ ఇచ్చారు. అయితే తన గురువు మృతికి పవన్‌కళ్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వద్ద శిక్షణ తీసుకున్న రోజులను పవన్ గుర్తు చేసుకున్నారు. మార్షల్ ఆర్ట్స్, ఆర్చరీ శిక్షకులు షిహాన్ హుసైని తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు గురయ్యానని పవన్ అన్నారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని నాలుగు రోజుల క్రితమే తెలిసిందని.. విదేశాలకు పంపించి వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తానని చెప్పినట్లు పవన్





పేర్కొన్నారు. ఆయన్ని కలిసేందుకు ఈ నెల 29న వెళ్లాలని అనుకున్నానని.. కానీ ఈలోపే ఇలా జరిగిపోయిందని బాధపడ్డారు.

తనకు ఎంతో నియమ నిబంధనలతో శిక్షణ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. తొలుత శిక్షణ ఇచ్చేందుకు హుసైని ఒప్పుకోలేదని.. ఎంతో బతిమాలితే ఒప్పుకున్నారనే విషయాన్ని వెల్లడించారు. తెల్లవారుజామునే వెళ్లి.. సాయంత్రం వరకూ అక్కడ శిక్షణ పొంది బ్లాక్‌బెల్ట్ సాధించినట్లు పేర్కొన్నారు. ఇంకా ఎంతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేసేవారిని అన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. మరణానంతరం ఆయన దేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వడం ఆయన ఆలోచన దృక్పథాన్ని వెల్లడించిందన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.




# నా కెరీర్‌లో బెస్ట్ మూవీ 'రాబిన్‌హుడ్'



%హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ రాబిన్‌హుడ్. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకీ కుడుముల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "నేను హీరోని బట్టి కథ రాస్తాను. రాబిన్‌హుడ్ ఐడియా ముందే వుంది. నితిన్‌తో ఫిక్స్ అయ్యాక ఆయనకి తగ్గట్టుగా కథని మలిచాను. రాబిన్‌హుడ్ జర్నీ వండర్‌ఫుల్‌గా జరిగింది. ఇందులో హీరో శారీరక బలం కంటే మానసిక బలం గొప్పదని నమ్మే వ్యక్తి. సినిమాల్లో ఫస్ట్ 20 నిమిషాలు హీరో క్యారెక్టర్‌ను పరిచయం చేయడానికి రకరకాల గెటప్స్ అలరిస్తాయి. 20 నిమిషాల తర్వాత కథ మారిపోతుంది. చాలా డిఫరెంట్ గా ఉంటుంది. ఈ సినిమా నితిన్ కెరీర్‌లో, నా కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందని నమ్మకం ఉంది. –ఇందులో ఒక క్యామియో రోల్ ఇంటర్నేషనల్ స్టార్ చేస్తే బాగుంటుందని అనుకున్నాను. నిర్మాతలు ఎవరని అడిగినప్పుడు డేవిడ్ వార్నర్ అని చెప్పాను. నిర్మాత రవి చాలా సీరియస్‌గా ప్రయత్నించి వార్నర్‌ని ఢిల్లీలో కలిసే ఏర్పాటుచేశారు. ఆయన కథ విని ఈ సినిమాకు వెంటనే ఓకే చెప్పారు. ఇందులో శ్రీలీల క్యారెక్టర్ చాలా ఫన్నీగా ఉంటుంది. ఆ క్యారెక్టర్‌లో చాలా ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. –ప్రొడ్యూసర్స్ మొదట పుష్ప సినిమాలో కేతికతో ఒక స్పెషల్ నెంబర్ చేయాలని అనుకున్నారు. కానీ అప్పుడు కుదరలేదు. ఈ సినిమాలో ఆ అవకాశం ఉన్నప్పుడు కేతిక అయితే బాగుంటుందని అనుకుని ఈ సాంగ్ చేయించాం. –ఇక భవిష్యత్తులో తప్పకుండా చిరంజీవితో సినిమా చేస్తాను"అని అన్నారు

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com